# స్నేహబంధం

తెల్లటిబట్టలు వేసుకున్న లైలా ఒడిలో నల్లగా నిగనిగలాడే జిమ్మీ ఆనాడు పార్కుకు వచ్చిన పిల్లలకొక కొత్త ఆకర్షణీయమైన దృశ్యం. ఒడిలో కూర్చోబెట్టుకుని, దానివీపు లైలా నిమురుతూ ఉంటే తోక ఆడిస్తూ మధ్య మధ్య మిణుకు మిణుకుమనే కళ్ళతో అందరినీ చూస్తోంది జిమ్మీ.

దాని అందమంతా ఆ నలుపులో ఆ మెరుపులో ఉంది.

పిల్లలందరూ కొంచెం ఎడంగా నిలబడి దానినే చూస్తున్నారు.

నాలుగురోజులపాటు లైలా ఈడు పిల్లలు దూర దూరంగా నిలబడి, వాళ్ళల్లో వాళ్ళు గుసగుసలు మొదలు పెట్టారు.

"కుక్కపిల్ల బలే బాగుంది కదూ ?"

"బలే మెరిసిపోతోంది. పాలిష్ పెట్టినట్టున్నారు''

ఛీ ఛీ. కుక్కలకు పాలిష్ పెడతారేమిటి?"

"దాని రంగే అంతేమో?"

"నలుపయినా ముద్దుగా ఉంది"

"అదేమిటి? తోక చిన్నదిగా ఉంది కత్తిరించినట్టు?"

"మంచిజాతి కుక్కలకు తోకలు కత్తిరించేస్తే బాగా పెరుగుతాయట. మా నాన్న చెప్పాడు"

ఆ మహానగరంలో గల పార్కులన్నిటిలో గోకుల్ పార్కు పెద్దదనే చెప్పాలి. చుట్టూ అరగజం వెడల్పు గజం ఎత్తుగల బార్డరూ, మధ్య మధ్య రంగు రంగుల పూలమొక్కలూ, అక్కడా అక్కడా సిమెంటు సోఫాలూ పిల్లలకోసం

ఒక పక్కగా వాళ్ళనాకర్షించే ఉయ్యాలలూ, జారుడుబండలూ, పచ్చటి తివాచీ పరచినట్టుగా లాన్‌లతో ఆకర్షణీయంగా ఉంటుంది. ఆరుగంటలు కాగానే నాలుగు దిక్కులా వెన్నెల పరచుకున్నట్టుగా వెలిగే ట్యూబ్‌లైట్ల కాంతితో, చల్లగాలి వీస్తూ ఉంటే, ఆ పార్కును వదలిపెట్టి వెళ్ళలేని చిన్నా పెద్దలతో, కళకళ లాడుతూ ఉంటుంది.

స్కూళ్ళు వదలగానే యూనిఫారములు విప్పి, కాఫీ టిఫిన్లు గబగబా ముగించి ఆటలకు బయలుదేరే పిల్లలూ ఉయ్యాలలూగాలన్న ఉబలాటంతో తల్లులతో నౌకర్లతో వచ్చి చిన్నపిల్లలూ, 'కాసేపు అట్లా పార్కులో చల్లగాలికి కూర్చుందామని వచ్చే పెద్దలూ-అందరికీ అన్ని విధాలుగా కాలక్షేపం కలిగించే బటానీలూ, వేరుసెనగలు జీడిపప్పులూ, పళ్ళూ అమ్మకందారుల కేకలతో సాయం కాలం నాలుగుగంటల నుంచీ కోలాహలంగా ఉంటుందా పార్కు. మైమరపించే చల్లటిగాలి వీస్తూ ఉంటే-గుంపులు గుంపులుగా చేరిన జనం ఎడతెగని కబుర్లు చెప్పుకుంటూ టైము చూసుకోకుండా కూర్చుంటారు.

అరఎకరానికి కొంచెం తక్కువగా ఉన్న ఆ పార్కు చుట్టూ రోడ్డూ, దాని కవతల గవర్నమెంటు క్వార్టర్సూ ఉండటంచేత ఆపార్కు అందరికీ అందు బాటులో ఉన్నది. ఆకాలనీ పేరే గోకుల్ కాలనీ, ఆపేరే పార్కుకు పెట్టారు. ఎక్కువగా ప్రభుత్వోద్యోగులే ఆ క్వార్టర్సులో ఉంటారు.

కొత్తగా బదిలీఅయి వచ్చిన జాన్‌బట్ పదమూడో నెంబరు క్వార్టర్సులో దిగి వారం రోజులే అయింది.

జాన్‌బట్ గారాబాల పట్టి లైలా.

ఆమె పెట్ జిమ్మీ.

ఆ యింటికి రాగానే ఆ పార్కును చూసి లైలా సంబరపడిపోయింది. "జిమ్మీతో ఆ పార్కులో తిరగవచ్చు. స్నేహితుల కోసం వెతుక్కోనవసరం లేకుండా ఎంతోమంది ఆడా మగా పిల్లలున్నారు. చాకొలెట్లూ బిస్కెట్లూ కూడా అక్కడ దొరుకుతాయి డాడీ. ఈ పార్కెంతో నచ్చింది నాకు" తండ్రి ఆఫీసు నుంచి రాగానే ఎదురుగావెళ్ళి చెప్పింది ఎగురుతూ లైలా.

మొదటిరోజే తండ్రిని కూడా బలవంతంచేసి తీసుకువచ్చి అన్నీ చూపించింది.

"స్కూలునుంచి వచ్చిన తరువాత నువ్వీమీనీ నన్నూ ఎక్కడికయినా తీసుకువెళ్ళమని తొందరపెట్టకుండా, ఈ పార్కుకు వచ్చి ఆడుకో. నీవు కోరినంత మంది స్నేహితులు దొరుకుతారిక్కడ. ఎవరికీలేని జిమ్మీ ఉంది నీకు. అవునా?" అన్నాడు. జాన్‌బట్‌కి ఊపిరి పీల్చుకున్నట్లయింది ఆ పార్కును చూడగానే.

వారం రోజులపాటు బెరుకు బెరుకుగా దూరం నుంచే జిమ్మీనీ లైలానూ చూసిన పిల్లలు ఆనాడు మరింత దగ్గరగా వచ్చారు. ఆ గుంపులో నుంచి రాము ఆమెకెదురుగా నిలబడి "కుక్కపిల్ల ఎంత బాగుందో? ముట్టుకుంటే కరుస్తుందా?" అడిగాడు మురిపెంగా.

"ఏమనదు. తాకిచూడు" అంది లైలా.

"అబ్బ. ఎంత మెత్తగాఉందో. మఖ్‌మల్ శాటిన్ బట్టలు తాకినంత మెత్తగా ఉంది" అబ్బురపడుతూ అక్కడే నిలబడి చూస్తున్నాడు రాము.

రాము వెనకాలే రంజిత్‌సింగ్ నిలబడ్డాడు. అతడికికూడా దాన్ని తాకి చూడాలనీ ఎత్తుకోవాలనీ ఉంది. రామును పక్కకు తప్పుకొమ్మని చెప్పి లైలా కెదురుగా వచ్చి నిలబడ్డాడు.

"ఏమిటలా చూస్తున్నావు? తాకి చూస్తావా?"

"నాకు ఎత్తుకోవటమంటే ఇష్టం. నాకు భయంలేదు"

"ఏమీ అనదు. ఎత్తుకో. కాని పడెయ్యకూ, జాగ్రత్త. అదంటే నాకు ప్రాణం" అతడికి అందించింది లైలా. తన జిమ్మీని అందరూ మురిపెంగా చూస్తుంటే ఆమె కెంతో గర్వంగా ఉంది. కాని రంజిత్‌సింగుకి ఇచ్చేటప్పుడు కొంచెం భయం వేసింది. అతడు ఆమె చేతిలో నుంచి లాక్కున్నట్లు తీసుకుని పరుగెత్తాడు.

ఆదుర్దాతో లైలా లేచి నిలబడి "ఏయ్, నాజిమ్మీనిచ్చేయ్" అంటూ కేక పెట్టింది.

'రంజిత్' కుక్కపిల్లను గుండెకానించుకుని పార్కంతా ఒకసారిచుట్టి వచ్చాడు.

కుక్కపిల్లను చూడగానే ప్రాణం లేచి వచ్చింది లైలాకు.

"భయపడుతుంది చిన్నపిల్లకదూ?" అంటూ ఆత్రంగా తీసుకుని ఒళ్ళో కూర్చో పెట్టుకుంది ఎవరు తీసుకుపోతారో నన్నట్టుగా.

"ఏస్కూల్లో చదువుతున్నావు.? ఏక్లాసు?" అంటూ దగ్గరగా వచ్చి కూర్చుంది మంగ.

"నేనా? సెంట్ గేబ్రియల్ స్కూల్లో చేరాను. ఇంకా వారం కూడా కాలేదు. ఆరోక్లాసు. మరి నీవు?"

"వివేకానంద స్కూల్లో ఏడోక్లాసు."

"చాలా దూరమా?"

"అంత దూరంలేదు. నేను బస్సులో వెళ్తాను. ఒకటే స్టాపు'

"ఎక్కడుంటావు?" మరొక ప్రశ్న వేసింది లైలా.

"ఈ కాలనీలోనే, ఆ కనబడేదే మాయిల్లు. దాని నెం 37."

"ఈ కుక్కపిల్ల చాలా బాగుంది. పెంచుతున్నావా?"

"అవును. నాకు కుక్కపిల్లంటే ఎంతో ఇష్టం నా పుట్టినరోజుకు మా డాడీ ప్రెజెంటు చేశాడు."

వీళ్ళందరూ అక్కడ గుంపుగాచేరి ఏంచేస్తున్నారోనని అమానుల్లాఖాన్ పరుగెత్తుకుంటూ వచ్చి అందరినీ పక్కకు నెట్టి చూశాడు.

లైలా ఒడిలో నల్లగా నిగనిగలాడే కుక్కపిల్ల కనబడ్డది.

"నేనూ ఒకసారి ఎత్తుకుంటాను. ఇస్తావా? నేను ఎన్నో కుక్కపిల్లలను చూశాను. కాని-దీన్ని చూడగానే ఎత్తుకోవాలనిపిస్తోంది. ఈ రంగంటే నాకెంతో ఇష్టం. ఎక్కడా ఒక్క మచ్చయినాలేదు" అంటూ ఒంగి చేతులు చాపాడు.

"ఎత్తుకుంటావా? పరుగెత్తకుమరీ, నాకు భయం జారిపడితే దెబ్బ తగులుతుంది. ఎముకలు విరిగితే డాక్టరు దగ్గరికి వెళ్ళాలి" అంది జిమ్మిని మరింత దగ్గరకు లాక్కుని బుంగమూతితో లైలా.

"నేనట్లా చెయ్యను. ఇందాక రంజిత్ పరుగెత్తాడు. నేను అట్లా పరుగెత్తను. నడుస్తాను"

అమానుల్లాఖాన్‌కి పదకొండేళ్ళుంటాయేమో, గులాబీ పువ్వులా సుకుమారంగా ముట్టుకుంటే మాసిపోతాడో-నలిగిపోతాడో అన్నట్టుగా ఉన్నాడు. ఆమె ఊఁ అనకముందే ఆమె ఒడిలోనుంచి తీసుకుని మెల్లగా నడుస్తు వెళ్లాడు. గులాబీరంగు అమానుల్లా చేతుల్లో నిగనిగలాడే నల్లటి కుక్కపిల్ల-చూసేవాళ్ళకు వింతగా కనబడ్డది. అందరూ అతడినీ, ఆ కుక్కపిల్లనూ చూడటం మొదలు పెట్టారు. అతడు జాగ్రత్తగా రెండు చేతులతో పట్టుకుని పార్కంతా ఆ మూల నుంచి ఈ మూల వరకూ తిప్పి తీసుకువచ్చాడు.

అతడు జిమ్మీని ఇవ్వగానే, ఎంత సేపయిందో ననుకుంటూ గాభరాగా చూస్తున్న లైలా అతడి చేతిలోనుంచి తీసుకుని అమ్మయ్య అనుకుంటూకూర్చుంది. ఆమెగుండె అప్పటివరకూ గబగబా కొట్టుకుంటునేఉంది. అతడు "దానిగొంతు నులిమేస్తాడో ? కాళ్ళు విరిచేస్తాడో" నన్న భయంతో ఒణికిపోయింది. జిమ్మీ దేహాన్ని ప్రేమతో నిమురుతూ ఇంకెవరికీ ఇవ్వకూడదనుకుంది. అసలే తలమీద వెంట్రుకలతో ముడివేసుకున్న రంజిత్‌సింగ్‌నూ, చూడీదార్ పాయ్‌జామా మీద కుడతా వేసుకుని ఠీవిగా తిరుగుతున్న అమానుల్లాఖాన్నూ చూడగానే ఆమెకు మొదట కొంచెం భయంవేసింది, కాని వాళ్ళమాటలు కరుకుగాలేవు అందరిలాగే ముద్దుగా ఉన్న ఆ కుక్కపిల్లకోసం ఆమెతో ఎంతోబాగా మాట్లాడి స్నేహం చేసుకోవాలన్న ఉద్దేశ్యమే కనబడ్డది.

"భయపడ్డావా తీసుకుని పారిపోతానని ? ముద్దుగాఉంటే నాకూ ఎత్తుకోవాలపించింది. అందరూ దానివంక చూడటం మొదలుపెట్టారు. వాళ్ళుచూసిన కొద్దీ నాకు మురిపెమనిపించి మెల్లగా నడుస్తూవచ్చాను" అన్నాడు అమానుల్లా తప్పుచేసినట్టుగా ముఖంపెట్టి.

"లేదు-లేదు. నాకు జిమ్మీ అంటే ఎంతోఇష్టం. ఒక్కనిమిషమైనా ఒదిలి ఉండను. రాత్రిళ్ళు నా మంచం దగ్గరే ఒక చిన్నబల్లమీద దిండులేసి పడుకోబెట్టుకుంటాను. తెల్లవార్లూ నా చెయ్యి దానిమీదనే ఉంటుంది."

ఆ మరునాడు మళ్ళీ అందరూ లైలా చుట్టూచేరారు.

"దీనికి తినటానికికేంపెడతారు ?"

"పాలూ రొట్టె బిస్కెట్లూ"

"ఇంతేనా ? మాంసం గుడ్లూ పెట్టరా ?" అమానుల్లా అడిగాడు.

"ఇంకా మొదలుపెట్టలేదు. 'కొన్నిరోజులుపోయిన తరువాత పెడదాం' అని మమ్మీ అంటుంది"

ఆ రోజు ఎవరూ లైలా దగ్గర్నుంచి జిమ్మీని తీసుకోలేదు. ఊరికే చూస్తూ కూర్చున్నారు చుట్టూ.

"స్నానం చేయిస్తారా ?" అడిగింది మంగ.

"ఆఁ. ఒక చిన్నతొట్టిఉంది. గోరువెచ్చటి నీళ్ళతో సబ్బురుద్ది మమ్మీ స్నానం చేయించి టర్కిష్ తువాలతో తుడుస్తుంది."

తరువాత పిల్లలందరు గుంపుగా కూర్చుని కథలు చెప్పుకున్నారు. రామూ హాస్యంగా మాట్లాడతాడు. అతడి మాటలను అందరూ ఎంతో కుతూహలంతో విన్నారు. రంజిత్ రామూతో ఫుట్ బాల్ ఆడాడు. మిగతావాళ్ళు చూశారు. లైలాకు రింగ్ ఆడటం బాగావచ్చు. తనకూవచ్చునని అమానుల్లా అన్నాడు.

లైలా మనసులో వాళ్ళతో ఆడాలని ఉంది. కాని జిమ్మీని వదలిపెట్టటం ఇష్టంలేదు. ఒకమాదిరిగా ముఖంపెట్టింది.

"పోనీ, నా ఒడిలో కూర్చోబెట్టుకుంటాను. నేను ఇక్కడినుంచి లేవను." అంది మంగ.

మంగ మాటలమీద లైలాకు నమ్మకం కుదిరింది. రింగ్ తీసుకుని లేచింది.

ఆరుగంటలు దాటేవరకూ రింగు ఆడారు. రంజిత్ రామూ కూడా కలిశారు.

"అయ్యో, జిమ్మీకి పాలవేళయింది" చటుక్కున లైలా ఆట వదిలిపెట్టి వచ్చి జిమ్మీని ఎత్తుకుంది.

"రేపు వస్తావా ?" అందరూ ఒక్కసారే అడిగారు. అప్పుడే వెళ్తావా అన్నట్టుగా.

"ఎందుకురాను ? నేను ఐదింటికల్లా వస్తాను."

"మేమూ వస్తాము" అందరూలేచారు.

లైలా వెళ్ళిపోతుంటే గేటువరకూ సాగనంపారు. మంగ తండ్రిని చూడ గానే "ఇంటికివెళ్దామా నాన్నా ?" అంది. వాళ్ళిద్దరూ గేటుకు ఎడమచేతి వైపుగా ఉన్న క్వార్టర్సు వైపు వెళ్ళారు.

ముగ్గురు మగపిల్లలు ఎగుర్తూ గంతులేస్తూ మరో అరగంట ఆడుకుని ఇళ్ళకు చేరుకున్నారు.

ప్రతిరోజూ తన జిమ్మీని మెచ్చుకునే స్నేహితులను కలుసుకోవచ్చనీ ఆడుకోవచ్చనీ లైలా టైం చూసుకుని పార్కుకు బయలుదేరేది. జిమ్మీతో ఈపాటికి లైలా వచ్చేఉంటుందని మిగతా నలుగురూ అక్కడికి చేరుకునేవారు. బఠా నీలూ పప్పులూ చాకొలెట్లూ కొనుక్కుని తింటూ, కబుర్లూ కథలూ చెప్పుకునే వారు. ఒకరి తరువాత ఒకరు జిమ్మీని దించకుండా ఎత్తుకుని ఆడుకునేవారు.

అందరూ పదిరోజుల్లోనే స్నేహితులయ్యారు. ఒకనెలలో ఆ స్నేహం బంధంగా మారి గాఢంగా అల్లుకుపోయింది. ప్రతిరోజూ అందరూ కలుసుకోవటం రోజూ సూర్యుడు ఉదయించినంత కచ్చితంగా ఉండేది. ఒకరిని చూడనిదీ ఒకరు ఉండలేని స్థితికి చేరుకుంది ఆ స్నేహబంధం. వర్షాకాలంలో జాగా ముసురుపట్టి నప్పుడు లైలా బైటికివచ్చేదికాదు. నలుగురూకలిసి లైలా యింటిముందర నిల బడి పిలిచేవారు. కిటికీలోనుంచి చూసి లైలా తలుపుతీసేది.

''మనం అటువక్క వరెండాలో కూచుందాం రండి" అందరూ అక్కడికి చేరుకునేవారు. లైలా జిమ్మీని నిర్భయంగా ఒదిలిపెట్టి వాళ్ళతోచేరేది. అందరూ తమతమ స్కూళ్ళను గురించీ, టీచర్లను గురించీ మాట్లాడుకునేవారు.

ఒకనాడు రంజిత్ తన స్కూలుసంగతి చెప్పటం మొదలుపెట్టాడు. వాళ్ల స్కూల్లో ఒక టీచరున్నాడట. ఆయనకు కోపంవస్తే పిల్లలను "కప్పలు మాదిరిగా బెకబెకలాడతారేం" అని కోప్పడేవాడట. ఆ మాటలు వినగానే అందరూ పకాలున నవ్వారు.

"మా టీచరు ఏమంటాడో తెలుసా ? "మొండిఘటాలు, మొండిఘటాలు" అంటాడు అన్నాడు రామూ. మళ్ళీ నవ్వులు.

మధ్యమధ్య లైలాతల్లి మేరీవచ్చి తొంగిచూసేది పిల్లలేం చేస్తున్నారోనను కుంటూ. అందరికీ తలా ఒక చాకొలెట్ ఇస్తూఉండేది.

మంగతండ్రి రామానుజం లైలా యింటికివచ్చి బజర్ నొక్కాడు.

మేరీ తలుపుతీసి, "ఎవరికోసం ?" అడిగింది.

"మా అమ్మాయి మంగ ఇక్కడే ఉందాండీ ? వాళ్ళమ్మ భయపడుతోంది ఎక్కడికి వెళ్ళిందోనని ''

"ఉంది- పిలుస్తాను" లోపలికివెళ్ళి మంగను పంపింది.

"నాన్నా నువ్వొచ్చావా ?"

"అవునమ్మా. ఆలస్యమైందని అమ్మ భయపడుతోంది-పద''

"ఏమయిందంటే-జిమ్మీలేదూ - దానికి జ్వరం తగిలింది. అందుకని అందరం అక్కడే కూర్చున్నాం" అంటూ బయలుదేరింది.

జిమ్మీకి జ్వరమా ? అయితే ఏంచేస్తారు ?" అడిగాడు.

"వాటికోసం వేరే హాస్పిటలుందట. డాక్టరు ప్రత్యేకంగా ఉన్నాడట. అక్కడ చూపించి మందూ ఇంజక్షనూ ఇప్పించి తీసుకువచ్చారట. పాపం చిక్కి పోయింది నాన్నా"

"మనుష్యుల్లాగే అవీను. పదపద. అమ్మ ఎదురుచూస్తూ ఉంటుంది. నీవు హోంవర్కు చేశావా ? లేక చెయ్యాలా ?"

"లేదునాన్నా, రేపొద్దున తొందరగా లేచిచేస్తాలే."

లైలా స్నేహితులు జిమ్మీకి తగ్గేవరకూ ఎవరూ పార్కుకు పోలేదు. అందరూ అక్కడే ఉంటున్నారు. లైలా భోజనం చేసేటప్పుడూ స్నానం చేసే టప్పుడూ ఎవరో ఒకరు జిమ్మీదగ్గర ఉంటున్నారు. పిల్లలు ఇళ్ళకు ఆలస్యంగా వస్తున్నారని వాళ్ళను వెతుక్కుంటూ తండ్రులు వస్తున్నారు. ఈ రాకపోకలలో పెద్దవాళ్ళకూ్కడా ఆ కుటుంబంతో పరిచయం ఏర్పడ్డది. రాజకీయాలూ

మామూలు ఉబుసుపోని కబుర్లూ ఉద్యోగాల సంగతులూ ఎన్నెన్నో విషయాల మీద చర్చించుకునేవారు.

నాలుగురోజుల్లో జిమ్మీ ఆరోగ్యం మెరుగైంది. మామూలుగా ఇంట్లో తిరుగుతోంది. పిల్లలు సంతోషంగా ఉన్నారు. కాని-జిమ్మీని ఇంకా పార్కుకు తీసుకురావటంలేదు లైలా.

ఒకరోజు రంజిత్‌సింగ్ మెత్తటి టర్కిష్ తువాల పేకెట్ తెచ్చాడు జిమ్మీకి, అమానుల్లా కుక్కలుతినే బిస్కెట్లూ సబ్బు తీసుకువచ్చాడు. మంగ చిన్నదిండూ కవరూ తెచ్చింది. రామూ జిమ్మీ కప్పుకోవటానికి చిన్న రగ్గుతెచ్చాడు.

"ఏమిటీ! ఇవాళ మీరందరూ ఈ బహుమతులు తెచ్చారు? జిమ్మీ బర్త్‌డే అనుకున్నారా?"

"అందుకు కాదు. జిమ్మీకి జబ్బు తగ్గిపోయిందన్న సంతోషంతో తెచ్చాం" అన్నారు.

సంతోషంతో తీసుకుని అందరికీ థాంక్సు చెప్పింది లైలా. మేరీ అందరికి టీ బిస్కెట్లు ఇచ్చింది.

జిమ్మీ వీళ్ళ కలయికకూ స్నేహానికీ కేంద్రబిందువయింది.

పిల్లలు జిమ్మీకోసం వచ్చినప్పుడు జాన్‌బట్‌కు మనసులో అయిష్టత కలిగేది.రంజిత్‌సింగును చూడగానే దేహం జలదరించేది. అమానుల్లాను చూడగానే అప్రసన్నంగా ఉండేవాడు. ఈ సంగతి లైలా కనిపెట్టింది.

"వాళ్ళెంతో మంచివాళ్ళు డాడీ" అనేది.

"చూడు లైలా, అందరూ పైకి అలాగే కనబడతారు."

"లేదు డాడీ, నీవు నా స్నేహితులను ఇన్‌సల్టు చేస్తున్నావు" అనేది. అంతటితో ఆయన తగ్గేవాడు.

నగరంలో హిందూ మహమ్మదీయ తగాదాలు మామూలే. అవి ఒక్కొక్క సారి ఒకటిరెండు రోజుల్లో సమసిపోయేవి. కాని-అప్పుడప్పుడు అంత తొందరగా ముగిసేవి కావు. కనీసం పదిమందయినా చావటం, పాతిక ఇళ్ళయినా తగలబడటం

కొందరికి కత్తిపోట్లయినా తగాటంవంటివి రోజులకొద్దీ సాగుతూ ఉంటాయి. పోలీసుల కాల్పులూ టీయర్‌గ్యాస్ ఉపయోగించటాలూ, కర్ఫ్యూ పెట్టటాలూ అయిన తరువాత నగరంలో తిరిగి ప్రశాంతత నెలకొనటానికి పది రోజులపైగా పట్టేది.

అసలు ఈ కొట్లాటలు హిందువులపండగలకో మహమ్మదీయపండగలకో ప్రారంభమవుతాయి సామాన్యంగా.

ఈసారి ఘర్షణ అట్లా ప్రారంభంకాలేదు. ఎక్కడో మారుమూల సందుల్లో ఇద్దరిమధ్య ఘర్షణ జరిగి క్రమంగా పెద్దదయింది. నలుగురూ మూగారు. వాళ్లను చూడగానే ఆవేశ కావేశాలు పెరిగాయి. ఆ వాడలో ఉన్నవాళ్ళంతా పోగయ్యారు. గుంపులో ఉన్నవారు రెండుపక్షాలుగా చీలి కొందరిటూ కొందరటూ తీర్పు చెప్ప బోయి వాళ్ళూ ఘర్షణలలో చిక్కుకుపోయారు. కొందరిచేతుల్లో కర్రలూ చువ్వలూ బరిసెలూ, కొందరిచేతుల్లో రాళ్ళూ దుమ్మూ, కారప్పొడీ, నాటుబాంబులూ ఉన్నాయి. అన్నీ తరతమ భేదాలలో ప్రమాదకరమైనవే. పోలీసులు వచ్చేసరికి పదిమంది గాయాలతో కిందపడ్డారు.

పోలీసులు లాఠీచార్జిచేశారు. గుంపులో ఉద్రేకం హెచ్చింది. లాఠీలు గుంపును చెదరగొట్టలేకపోయాయి. పోలీసులు టీయర్‌గ్యాస్ ఉపయోగించారు. తుపాకులు గాలిలో పేల్చారు.

సద్దుమణిగింది కదా అని పోలీసులు వీధికిద్దరువంతున కాపలాఉండి గస్తీ తిరిగారు. రాత్రి పదకొండుగంటలవేళ కిరసనాయిల్ ఇళ్ళమీదపోసి ఎవరో అగ్గి పుల్లగీశారు. కాసేపటిలో పెంకులూ దూలాలూ ఫెటేలు మంటూకూలటం ప్రారంభ మయిందీ. మంటలు పైకెగియగానే పక్కనున్న గుడిసెలకు నిప్పంటుకుంది. ప్రజలు హాహాకారాలు చేస్తూ బిడ్డలతో సామాన్లతో కొందరు వీధుల్లో నిలబడ్డారు.

మంటలనుచూస్తూ కొందరు సామాన్లను పిల్లలను బైటికి తీసుకురాలేక అరుపులతో పెడబొబ్బలతో సహాయానికి రమ్మని ఇరుగుపొరుగులను పిలుస్తు న్నారు.

గాలికి విజృంభించిన ఆ అగ్ని మూడునాలుగు వీధులను తెల్లవారేసరికి

స్మశానంగా మార్చివేసింది. చివరిదశలో వచ్చిన అగ్నిమాపకదళం మాడిమసి అయిపోయిన ఇళ్ళమీద నీళ్ళుచల్లింది.

కాలివిరిగి పడిపోయిన దూలాలనూ, కూలిపోయిన గోడలనూ, పక్కకు తొలగించేటందుకు పోలీసులకు చాలామంది సహాయంచేశారు. సగం కాలిపోయిన వృద్ధులూ పూర్తిగా మాడిపోయిన పిల్లలూ ఏభయిమందివరకూ లెక్కతేలింది.

పోలీసు కర్ఫ్యూ విధించింది.

ఒళ్ళు కాలినవాళ్ళను వైద్యాలయానికి తరలించారు.

ఊరంతా అట్టుడికినట్టు ఉడికింది.

ఆ ఉద్రేకపూరితమైన పరిస్థితులలో గోకుల్ కాలానీలోని ఆ పిల్లలు ఇళ్ళల్లో లేరు.

ఆడవాళ్ళ ఏడుపులు. ఉదయం పదిగంటల సమయంలో. అమానుల్లాఖాన్ తండ్రి ఖాదరు ఉరుకు పరుగులమీద వచ్చి జాన్‌బట్ తలుపుతట్టాడు.

జాన్‌బట్‌కు తలుపు తీయటానికి సందేహంగా ఉంది. సందేహం కంటె భయమెక్కువగా ఉంది. ఈ మహమ్మదీయుడెందుకు వచ్చినట్టు? తలుపులు తెరవటానికి భయపడే రోజుల్లో ఖాదర్ వచ్చాడంటే-అర్థం?

"తియ్యాలా-వద్దా?" తచ్చాడుతున్నాడు తలుపుదగ్గర.

"బట్‌సాబ్! నేను ఖాదరును. అమాన్‌కోసం వచ్చాను. ఉన్నాడా?"

ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తలుపుతీశాడు బట్.

ఖాదర్ ముఖం అలసిపోయినట్టుంది. దైన్యం తొంగిచూస్తోంది. అతడి గొంతులో మాట పైకి పెకలని ఆదుర్దా ఉంది.

కంటితో చూస్తున్నా మాటలకందని భయం బట్ ముఖంలో స్ఫుటంగా కనబడుతోంది.

"రండి" ఖాదర్ లోపలికిరాగానే తలుపువేశాడు బట్. గడియపెట్టక

ముందే సిక్కుల తలపాగాతో రంజిత్ తండ్రి అజిత్‌సింగు తలుపు నెట్టుకుంటూ వచ్చాడు.

బట్‌కు ముఖంలో రక్తపు చుక్కలేదు. కాని-మర్యాద.

"రండి లోపలికిపోదాం" కిటికీ తలుపులువేసి గడియలు పెట్టి, లోపలికి వెళ్ళి కుర్చీలలో కూర్చున్నారు. అప్పటికే రామూతండ్రి సుబ్బారావు,మంగతండ్రి రామానుజం అక్కడ ఉన్నారు.

"మేము వీధి వైపునుంచి రాలేదు. మాకంత ధైర్యంలేదు. అందుకే వెనక తలుపు తీయించుకుని వచ్చాం. ఎవరు చూస్తారోనని భయపడుతూ ప్రాణాలర చేతుల్లో పెట్టుకునివచ్చాం పిల్లలకోసం. అన్నిచోట్లా వెతికాం. పిల్లలు కనబడ లేదు. వాళ్ళిక్కడ తప్పకుండా ఉంటారనిపించి వచ్చాం. ఆ కుక్కపిల్ల జిమ్మీ ఉంది చూశారూ-దాని ఆకర్షణ ఈ పిల్లలకు, ఇంతకూ ఎక్కడున్నారు?" రామానుజం అందరి ముఖాలు చూస్తూ మెల్లగా అన్నాడు.

మిగతా ముగ్గురి నాలుకలమీదా ఈ మాటలే ఆడుతున్నాయి. వాళ్ళకంటె ముందే అనేశాడు రామానుజం సాహసించి.

వచ్చినపనేమిటో రామానుజం చెప్పటంతో ఆ ముగ్గురి మనసులు తేలిక పడ్డాయి.

అంతలో సుబ్బారావన్నాడు- "మా ఆడవాళ్ళను ఖాదరుగారింట్లో దింపి వచ్చాము కాస్తధైర్యంగా ఉంటారని" ఈ మాటలంటూ వాళ్ళ ముఖాలలోకి చూశాడు. నిర్లిప్తంగా ఉన్నాయా ముఖాలు.

దూరంనుంచి అరుపులూ పరుగెత్తటాలూ వినబడుతున్నాయి. లైలాగదిలో పిల్లలంతా భయంతో బిగుసుక్కూర్చున్నారు. కథలూ కబుర్లూ చెప్పుకుందామని ఉంది. కాని నోరుమెదపటానికి భయం. వాళ్ళమధ్య జిమ్మీ ముడుచుకుని పడు కుంది.

సరిగ్గా అదేసమయంలో వాన అందుకుంది. జల్లుతో ప్రారంభమై జడి వానగా మారింది. ఆ అలజడిలో జడివానలో ఎవరిళ్ళకువాళ్ళు చేరుకోలేని పరిస్థితి.

అప్పుడు మాటకారి సుబ్బారావు నోరువిప్పాడు.

"మనభాషలు వేరు. మన మతాలువేరు. మన ఆచార వ్యవహారాలువేరు. కాని మనం ఈ ఆపదసమయంలో బట్ గారింటికి చేరుకున్నాం. మనపిల్లల కారణంగానే తప్ప సాధారణ పరిస్థితులలో మనం కలుసుకోము. ఎంతచిత్రంగా ఉంది ?"

ఆ మాటకు ఖాదరు "మనమందరమూ ఆపదలో ఉన్నాం, బయటకాలు పెట్టలేని పరిస్థితి, అందులో మనపిల్లలు ఇక్కడున్నారు. వాళ్ళందరినీ కాపాడిన బట్ కుటుంబమే మననిప్పుడు కాపాడాలన్న ఆశతో ఉన్నాం." అన్నాడు అల్లరులను గురించి సిగ్గుపడుతూ.

"మీరిక్కడున్నారని నాకు తెలియదు. మావాళ్ళమీద ప్రజలకు గొంతు వరకూ కోపం కసీ కక్షగా ఉంది. కనబడితే పొడిచేస్తారు. బట్ గారిల్లు క్షేమంగా ఉంటుందని రంజిత్ పేరుచెప్పి నేనువచ్చాను." సిక్కు తలపాగాతో రంజిత్ తండ్రి హుందాగా అన్నాడు.

"మనం మనపిల్లలవల్లనే ఇక్కడికి చేరుకున్నామని అందరం ఒప్పుకుంటున్నాము. పిల్లల స్నేహానికి కారణమయింది జిమ్మీ. పిల్లలు ఎప్పుడూ స్నేహంగా జిమ్మీతో ఆడుకుంటూ ఆనందంగా ఉండాలంటే మనంకూడా ఒకరినిచూసి మరొకరు భయపడకుండా స్నేహభావంతో ఆత్మీయులంకావాలి ఇట్లా అందరూ ఏదో కారణంవల్ల ఆత్మీయులయితే దేశంలో వెన్నెలకాసినట్టుంటుంది. . ."ఇంకా ఏదో చెప్పబోతున్నాడు రామానుజం.

"బ్రదర్స్, మీ మాటలన్నీ నేను వింటున్నా. ఆ వెన్నెలకోసం అందరం ఎదురుచూద్దాం. ముందు ఈ చల్లటివేళ వేడివేడి టీ తీసుకోండి" అంటూ టీకప్పుల ట్రేతో మేరీవచ్చింది.

"పిల్లలు ?" అందరూ ఒక్కసారే గొంతెత్తారు.

"వాళ్ళకు ఇచ్చే ఇక్కడికి వచ్చాను. ఆ పసివాళ్ళకు ఈ అల్లర్లు ఎందుకు జరుగుతున్నాయో తెలియదు స్నేహంతప్ప. మీరుకూడా మరే ఆలోచనా మనసులో పెట్టుకోకుండా తీసుకోండి" బల్లమీద పెట్టింది.

ఆ సమయంలో అందరికీ ఏదో దారిదొరికినట్లయింది. మనసులు తేలిక పడ్డాయి. కళ్ళల్లో ఆనందాన్ని సూచించే కాంతులు కనబడ్డాయి.

కాని-ఎవరు ముందడుగు వెయ్యాలి ?

"ఇంకా ఆలోచిస్తున్నారు. మనసులు నిర్మలమయితేగాని పిల్లలస్నేహం వంటిస్నేహం మనలో కలగదు. అంతేనా బ్రదర్స్ ?" మళ్ళీ అందుకుంది మేరీ.

ఆ పిలుపుతో సుబ్బారావు అందరికంటె ముందులేచి "ఈ కప్పుచాయ్‌తో చీకట్లు విడిపోవాలి. అందుకోండి కప్పులు" అంటూ అందరికీ తానే అందించి తనొకటి తీసుకున్నాడు.

టీ తీసుకున్న తరువాత అందరూ తేరుకున్నారు. ప్రశాంతంగా ఆలోచనల్లో పడ్డారు.

"అమ్మా ! నీ చేత్తో అమృత మందించినట్లు టీ అందించావు. ఇదే మన స్నేహానికి బునాది" అన్నాడు రామానుజం లేచి.

"మేం చెప్పలేని మాటలు మీరు చెప్పగలుగుతున్నారు. అంతే-అంతే. ఇదే బునాది. ప్రారంభం" అన్నారందరూ లేచి, "ఇప్పుడు ఎక్కడికి వెళ్తారు ? బైటి మోతలు వినబడుతున్నాయా బ్రదర్స్ ? మనం మనంగానే ఉండి-మనలో మనం స్నేహబంధాన్ని పెంచుకోవచ్చు. సమష్టిగా కలిసిమెలిసి ఉండాలి. దానిలో తప్పేముంది ?"

"మనకు ఏది సమష్టిగా ఉంది ? అది తెలుసుకోలేకనే కదా ఈ అల్లరు ?" అన్నాడు రంజిత్‌తండ్రి అజిత్‌సింగు ఎర్రబడ్డ ముఖంతో.

"ఏదా ? మనకు ప్రపంచం సమష్టిగా ఉంది. మనదేశం సమష్టిగా ఉంది. మనఊరు సమష్టిగా ఉంది. పిల్లలు జిమ్మీకోసం స్నేహబంధాన్ని సృష్టించు కోలేదూ ? అలాగే మనం మనపిల్లలకోసం బటగారింటికివచ్చి స్నేహితుల మైనట్టుగా ఈ ప్రపంచంకోసం, దేశంకోసం స్నేహంగా ఉండాలి." అన్నాడు ఖాదరుముఖం చూస్తూ రామానుజం.

"అవునవును. ఎప్పుడూ ఈమాటలే చెవినబడుతూ-నాలుకమీద ఆడుతూ ఉండాలి" అన్నాడు రంజిత్‌సింగ్.

"నేను సిగ్గుపడుతున్నాను బ్రదర్స్. మీ అందరి సహకారం ఉంటే ధైర్యం వస్తుంది. ఈ తగాదాలలో ధననష్టం-ప్రాణనష్టం చాలా జరిగింది. మీ ముందు నా తల భూమిలోకి దిగిపోతోంది." ఖాదర్ గొణిగాడు. జరిగినదానిలో అతడికీ భాగముందన్న భావంతో.

అందరూలేచి కరచాలనం చేసుకున్నారు.

* * *